క్లుప్తంగా

రాంరెడ్డి కుంట పరిశీలన

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఏదులపల్లి గ్రామ శివారులోని రాంరెడ్డి కుంట ఆక్రమణకు గురవుతుందని వచ్చిన ఫిర్యాదుపై ఇరిగేషన్ అధికారులు స్పందించారు. మంగళవారం ఇరిగేషన్ ఏఈఈ శ్రీకాంత్ కుంటను సందర్శించి పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే చేయించి, నాలుగైదు రోజుల్లో బౌండరీలు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ఏఈ తెలిపారు.

పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి



ఉత్తులూరులో జొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి కృష్ణ

పెద్దశంకరంపేట(మెదక్): రైతులు పంటల సాగు విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఏఓ కృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఉత్తులూరు గ్రామంలో రైతులు పండిస్తున్న జొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు రోగాల బారిన పడకుండా రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి, అధిక దిగుబడులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు అఖిల్, వినీత్ తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



రామాయంపేట సహకార సంఘంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

రామాయంపేట(మెదక్): పట్టణంలో సహకార సంఘంలో మంగళవారం చైర్మన్ చంద్రం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం సీఈఓ నర్సింలుతో పాటు డైరెక్టర్లు పాల్గొన్నారు.

దొంతిలో..



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి గ్రామానికి సంబంధించి మన ఊరు–మన దొంతి క్యాలెండర్ మంగళవారం ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన భవనగారి శ్రీనివాస్ దొంతి గ్రామ విశిష్టత, ప్రముఖ కట్టడాలు గురించి ప్రత్యేకంగా ప్రచురించిన క్యాలెండర్లను గ్రామస్తులకు పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రతీ కుటుంబానికి క్యాలెండర్లు అందజేస్తున్నట్లు చెప్పారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు



పెద్దశంకరంపేట నుంచి శబరిమలకు వెళ్తున్న అయ్యప్పస్వాములు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రం నుంచి కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్ప దేవాలయానికి మాలధారులు మంగళవారం బయలుదేరి వెళ్లారు. పేటలోని మానిక్‌ప్రభు మందిరంలో గురుస్వామి రామచంద్రాచారి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించి అయ్యప్పస్వాములకు ఇరుముడులు కట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన భజనలు, కీర్తనలు అందరిని ఆకట్టుకున్నాయి.

కౌడిపల్లి(నర్సాపూర్): అయ్యప్పస్వామి దీక్ష



పాంపల్లి నుంచి శబరిమలకు వెళ్తున్న మాలధారులు

చేపట్టిన అయ్యప్ప స్వాములు ఇరుముడి ధరించి శబరిమల యాత్రకు తరలివెళ్లారు. మంగళవారం మండలంలోని పాంపల్లిలో అంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రీకాంత్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు చేసి, ఇరుముడి ధరించి శబరిమల యాత్రకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వాములు శ్రీను, మహేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఖాళీగా ఉన్న వంట మనిషి, మహిళా వాచ్‌మెన్ పోస్టులకు ఈనెల 5వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి విజయ బుధవారం తెలిపారు.

అందుబాటులోకి వచ్చేనా?

నిరుపయోగంగా పాఠశాల భవనం

- విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



ఉత్తులూరు ప్రాథమికోన్నత పాఠశాల భవనం

పెద్దశంకరంపేట(మెదక్): పాఠశాల నూతన భవనం నిర్మించి 11 ఏళ్లు అయినా.. అది నిరుపయోగంగా ఉంది. నిర్మించి.. దశాబ్దం అవ్వడంతో భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఈ భవన పరిస్థితిపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తొలి విడత మన ఊరు–మనబడి పథకంలో ఈ పాఠశాలకు గుర్తించి పనులు ప్రారంభించారు. గతేడాది క్రితం చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. పెద్దశంకరంపేట మండలం ఉత్తులూరు ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు 70 మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 2013లో నూతన భవన నిర్మాణానికి అప్పట్లో రూ.15.90 లక్షలు ఆర్వీఎం ద్వారా నిధులు మంజూరు చేశారు. భవన నిర్మాణానికి కొనసాగుతున్న పాఠశాల ఆవరణలో స్థలం లేకపోవడంతో గ్రామ శివారులో దారి లేని ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. మరో ఆరు నెలలకు అదనపు గది కోసం రూ. 8 లక్షలు మంజూరు చేసి నిర్మాణం ప్రారంభించారు.

ఉపయోగంలోనికి తెవాలి

మొత్తం నాలుగు గదుల నిర్మాణాలను పూర్తి చేశారు. వీటితో పాటు టాయిలెట్స్‌లను నిర్మించి, విద్యుత్, ఫ్లోరింగ్ పనులు మొత్తం పూర్తి చేశారు. కానీ ఇప్పటి వరకు పాఠశాలను నూతన భవనంలోకి మార్చకుండా అలాగే వదిలేశారు. పాఠశాల నిర్మాణం ఏడాదిలో పూర్తయిన గ్రామ శివారులో ఉండడంతో పాటు సరైన దారి లేక వినియోగంలోకి తేవడం లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు పట్టించుకోక భవనాలు నిర్మించినా ఫలితం లేకుండా పోయింది. కొత్త భవనంలో తలుపులు కిటికీలు ఊడి పోయి, ఫ్లోరింగ్ ధ్వంసమై ప్రారంభంలోకి రాకుండానే శిథిలావస్థకు చేరగా, అధికారులు మన ఊరు–మన బడి పథకం కింద మరోమారు రూ.7.60లక్షలతో మరమ్మతులు, ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.30 లక్షలతో అదనంగా ప్రహరీ, వంటగది నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి పనులు చేపట్టారు. పాఠశాలకు కాల్వ మీదుగా దారి ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించారు. పనులు పూర్తయినా ప్రహరీ నిర్మాణానికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో చివరిదశలో పనులు నిలిచాయి. ఒక్క ప్రహరీ మినహా మిగతావి పూర్తి కావడంతో పాఠశాల భవనం వినియోగానికి సిద్ధంగా ఉంది.

ఉన్నతాధికారులకు నివేదించాం

ఉత్తలూరు ప్రాథమికోన్నత పాఠశాల పనులు దాదాపు పూర్తయ్యాయి. త్వరలోనే వాటిని పూర్తి చేయించేలా చర్యలు చేపట్టి, నూతన భవనంలో తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదించాం.

– వెంకటేశం, ఎంఈఓ, పెద్దశంకరంపేట

టీచర్లు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ హేమభార్గవి

కౌడిపల్లి(నర్సాపూర్): అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని సీడీపీఓ హేమభార్గవి అన్నారు. మంగళవారం తునికి వద్ద మండలంలోని రాయిలాపూర్, కౌడిపల్లి సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించి పిల్లలకు ఆటపాటల ద్వారా విద్యబోధన చేయాలన్నారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. ప్రతీ నెల రికార్డులు, ఆన్‌లైన్ నమోదు తప్పులు లేకుండా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మి, ఖమర్‌సుల్తాన, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కుల వివక్ష తగదు: ఏఎస్ఐ



చిన్నశంకరంపేట(మెదక్): మాట్లాడుతున్న ఏఎస్ఐ శంకర్

చిన్నశంకరంపేట(మెదక్): భారత రాజ్యాంగం ప్రకారం అందరు సమానమేనని గ్రామంలో ఎలాంటి కుల వివక్ష ఉండకూడదని నార్సింగి ఏఎస్ఐ శంకర్ కోరారు. మంగళవారం నార్సింగి మండలం సంకాపూర్ గ్రామంలో తహసీల్దార్ మన్నన్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అందరు కలిసి మెలిసి ఉండాలన్నారు. ఆలయల్లోకి ఎలాంటి వివక్షలేకుండా అందరు దర్శించుకోవచ్చన్నారు. హోటళ్లల్లో కూడా ఎలాంటి వివక్ష లేకుండా అందరికి సమానంగా సౌకర్యాలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎల్లమ్మకు బోనాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో వెలిసిన రేణుకా ఎల్లమ్మకు బోనాలను మంగళవారం భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాల్దస్ మల్లేశ్‌గౌడ్, అరవింద్‌గౌడ్, నవీన్‌గౌడ్, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు శిక్షణ

దుబ్బాక: విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ఓజేటీ (ఆన్ ది జాబ్ ట్రైనింగ్)ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు కొనసాగుతున్న శిక్షణను సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో వివిధ విభాగాలను సందర్శించారు. ఆసుపత్రిలో సేవలపై విద్యార్థులు రెండు నెలలుగా శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ శిక్షణ వల్ల ఇంటర్ పూర్తయిన వెంటనే ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆయన వెంట లెక్చరర్ శివకుమార్ ఉన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

చేగుంట(తూప్రాన్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం మాసాయిపేటలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేటకు చెందిన వజ్రయ్య (55) శ్రీనివాస నగర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై డిసెంబర్ 28న నిలబడి ఉండగా, వేగంగా వెళ్తున్న రైలు గాలికి కింద పడిపోయాడు. కిందపడి గాయాలపాలైన అతన్ని గాంధీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కామారెడ్డి రైల్వే ఏఎస్ఐ హనుమాండ్లు తెలిపారు.

తుక్కాపూర్‌లో..

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో తుక్కాపూర్ గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఘటనకు సంబంధించి మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బ్యాగరి మంజుల దంపతులు పెద్ద కుమారుడు జషువర్ధన్(18) డిసెంబర్ 25న తన ఇద్దరు స్నేహితులతో బైక్ పై మెదక్ వెళ్తున్న క్రమంలో కిష్టాపూర్ వద్దకు చేరుకోగానే బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో తనకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

భారీగా మద్యం అమ్మకాలు

కొల్చారం(నర్సాపూర్): నూతన ఏడాది ప్రారంభం వేళ కొల్చారం మండల పరిధిలోని చిన్నఘనాపూర్ శివారులోని మద్యం ఆధారిత నిల్వ కేంద్రం(ఇండియన్ మేడ్ లిక్కర్)ద్వారా డీపో 118 మద్యం దుకాణాలు, 15 బార్ల ద్వారా రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు చేపట్టారు. డిసెంబర్ 30వ తేదీన రూ.14,85,48 236 విలువ గల మద్యం అమ్మకాలు జరిగాయి. మరుసటి రోజు 31న రూ.10, 8,11,11 విలువ గల మద్యం అమ్మకాలు జరిగాయి. మొత్తంగా రెండు రోజుల్లో రూ.24,93,49348ల విలువగల అమ్మకాలు జరిగాయి.

ఇంకా మత్తులోనే వైన్స్ దొంగ

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని కనకదుర్గా వైన్స్‌లో చోరికి వచ్చి మద్యం మత్తుతో అపస్మారక స్థితికి చేరిన దొంగ ఒక రోజు గడిచినా.. ఇంకా మత్తులోనే ఉన్నాడు. నార్సింగి వైన్స్‌లో దొంగతనం కోసం వచ్చి మద్యం సేవించి అపస్మరక స్థితిలో వైన్స్‌లోనే పడిపోయిన విషయం తెలిసిందే. రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతున్న దుండగుడు కొంత వరకు కోలుకున్నప్పటికీ అపస్మరక స్థితి నుంచి బయటపడలేదని పోలీస్‌లు తెలిపారు. బాగా మద్యం తాగడం వల్లనే ఈ సమస్య వచ్చిందని, మత్తు తగ్గేందుకు వైద్య చికిత్స అందిస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు. కోలుకున్న తర్వాతే అతన్ని విచారించనున్నట్లు పోలీసులు చెప్పారు.

సర్వే పరిశీలన



తిమ్మాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తిమ్మాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న ప్రతీ కుటుంబాన్ని సర్వే చేయాలని తెలిపారు. సర్వే వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేతనాలు లేక కూలీల వెతలు



కూలీలతో మాట్లాడుతున్న వేణు

గజ్వేల్: ఉపాధి హామీ కూలీలకు నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని జాలిగామ గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు కూలీలకు వేతనాలు అందేలా చూడాలని, రోజువారీ రూ.300 వేతనం వర్తింపజేయలని డిమాండ్ చేశారు.

గృహ నిర్మాణ శాఖ పీడీగా మాణిక్యం

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా మాణిక్యం పదోన్నతిపై వచ్చారు. మంగళవారం మర్యాదపూర్వకంగా కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ డీఈ యాదగిరి, ఏఈ విద్యాసాగర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన అవసరం

దుబ్బాకటౌన్: సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని దేశ్ పాండే ఫౌండేషన్ కో ఆర్డినేటర్ దాతర పల్లి భాస్కర్ సూచించారు. రాయపోల్‌లో మంగళవారం రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మహిళలకు భరోసా.. షీటీం



విద్యార్థులతో షీటీం పోలీసు సిబ్బంది

ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: ఆపదలో ఉన్న మహిళలకు షీటీం అండగా ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన జిల్లాలో నెల రోజులుగా షీటీఎం నిర్వహించిన సేవా కార్యక్రమాలను చెప్పారు. మూడు ఈవ్‌టీజింగ్ కేసులు నమోదు చేయగా, 13 మందికి కౌన్సెలింగ్ చేశామన్నారు. ప్రభుత్వ కళాశాలలో, పాఠశాలల్లో ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్, డ్రగ్స్ మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 లేదా షీటీమ్ వాట్సాప్ నెంబర్ 87126 57963, 63039 23823 పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 57888లకు ఫోన్ చేసి రక్షణ పొందాలన్నారు.

అత్యాశకు పోకుండా జాగ్రత్తగా ఉండాలి

మెదక్ మున్సిపాలిటీ: ప్రజలు ఎవరు అత్యాశకు పోయి అనర్థాలు తెచ్చుకోవద్దని, అరచేతిలో ఉన్న అంతర్జాలంతో జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సైబర్ నేరాన్ని ప్రస్తావించారు. వర్క్ ఫ్రమ్ హోం పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరిట సైబర్ మోసానికి గురైన విధానం తెలిపారు. అదే ప్రక్రియలో అతను పూర్తిగా రూ. 1,08,800 పొగొట్టుకున్నట్లు తెలిపారు. ప్రజలు అది గమనించి అత్యాశకు పోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

మెదక్ మున్సిపాలిటీ: జీవితంలో ఉద్యోగ విరమణ సహజమని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఏఎస్ఐ మల్లప్ప, ఎమ్మాన్యుల్‌లకు వీడ్కోలు సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఉద్యోగ తరుణంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయన్నారు. అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

4 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

నర్సాపూర్: పట్టణంలోని కేతకి భ్రమరాంబ సమేత మరకత మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవాలు జనవరి నాలుగు నుంచి ప్రారంభమవుతాయని యాదవ సంఘం సభ్యులు తెలిపారు. మంగళవారం ఈ సందర్భంగా ఆలయం వద్ద ఉత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. శనివారం ఉదయం సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఆదివారం గంగకు వెళ్లుట, సోమవారం దేవుని లగ్నం, మంగళవారం నాగవెళ్లితో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు రాంలు యాదవ్, మల్లేశ్‌యాదవ్, నరేష్ యాదవ్ ఉన్నారు.

బ్యూటీపార్లర్ నిర్వహణపై అవగాహన



బ్యూటీ పార్లర్‌ను సందర్శించిన విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ బ్యూటీషియన్ ఒకేషనల్ కోర్సు చేస్తున్న ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు బ్యూటిపార్లర్ నిర్వహణపై అవగాహన కల్పించారు. మంగళవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని హర్షిక బ్యూటి పార్లర్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యూటీ పార్లర్‌లో అందించే సేవలతో పాటు బ్యూటిషియన్ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యూటిఈయన్ టీచర్ అనిత పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయం చేయాలి



అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థులు

కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్

నర్సాపూర్ రూరల్: ఆధునిక వ్యవసాయంపై అవగాహన అవసరమని తునికి కృషి విజ్ఞాన వేదిక సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని ఖాజీపేటలో మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ క్షేత్రస్థాయి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రైతు పంట మార్పిడి చేసి, పంటలు సాగు చేయాలని సూచించారు. పంటలు సాగు చేసే ముందు మట్టిని పరీక్షించి దానికి అనుగుణంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తాయని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక పద్ధతులను పాటిస్తూ వ్యవసాయం చేయాలన్నారు. ఖాజీపేట గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామ పంట భూముల మ్యాప్‌తో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రసన్న, ప్రియాంక, స్వాతి, సహరిక, మాధురి, శ్రీజ, రైతులు పాల్గొన్నారు.

వడ్డెర కాలనీ ఇందిరమ్మ సర్వే నిలిపివేత



కార్యదర్శి సువర్ణను వివరాలు ఇవ్వమని చెప్తున్న వడ్డెరకాలనీ వాసులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలోని ఇందిరమ్మ సర్వేను సాంకేతిక సమస్యతో నిలిపివేశారు. వడ్డెర కాలనీ కుటుంబ వివరాలు చేగుంట మండలం వల్లభాపూర్ గ్రామ యాప్‌లో రావడంతో గ్రామ కార్యదర్శి సువర్ణ సర్వే కోసం వెళ్లారు. ఇప్పటికే కొందరు పేర్లు నార్సింగి జీపీ యాప్‌లో రావడంతో సర్వే నిర్వహించారు. మంగళవారం మరి కొందరి ఇళ్లను సర్వే చేసేందుకు వల్లభాపూర్ జీపీ కార్యదర్శి రావడంతో వివరాలు అందించేందుకు వడ్డెర కాలనీ వాసులు నిరాకరించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన గ్రామ కార్యదర్శి సర్వేను నిలిపివేశారు. వల్లభాపూర్ పక్కనే ఉండడంతో కొందరి పేర్లు తమ జీపీలో వచ్చాయని, కానీ వారు నార్సింగి జీపీ పరిధిలో ఉండడంతో అధికారుల సూచన మేరకు సర్వేను నిలిపివేసినట్లు గ్రామ కార్యదర్శి సువర్ణ తెలిపారు.



పాపన్నపేటలో డీసీసీబీ బ్యాంకు వద్ద క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మేనేజర్ కిషన్

తక్కువ వడ్డీకే రుణాలు

డీసీసీబీ మేనేజర్ కిషన్

పాపన్నపేట(మెదక్): రైతు ప్రయోజనాలే లక్ష్యంగా డీసీసీబీ తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తుందని పాపన్నపేట శాఖ మేనేజర్ కిషన్ అన్నారు. మంగళవారం ఆయన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డీసీసీబీలో బంగారు ఆభరణాలపై రుణాలు, గృహ నిర్మాణ, వాహన రుణాలు ఇస్తామన్నారు. డిపాజిట్లపై ఇతర బ్యాంకుల కన్నా ఎక్కువ శాతం వడ్డీ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్లు మల్లేశం, దత్తు సేట్, మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, పూల్ సింగ్, సాయినాథ్ రావు, నవీన్, మాణయ్య, రైతులు పాల్గొన్నారు.